# గెలుపెవరిది?

—చిత్రపు హనుమంతరావ్


ప్రకాశం హైద్రాబాదువచ్చి నెల్లాళ్ళు కూడా కాలేదు. అంతకుముందు విజయవాడ ఆఫీసులో 'యూ. డి. సీ.' గా ఉండేవాడు. ఆఫీసరు ఉద్యోగాలకి ఆ 'డిపార్టుమెంటు' 'సెలక్షన్ టెస్టు' పెట్టడమూ, ప్రకాశం నెగ్గడమూ జరిగింది. అతడిని హైద్రాబాదులో మెయిన్ ఆఫీసులో 'సెక్షన్' ఆఫీసరుగా వేసారు.

విజయవాడనుంచి ఎవరో ప్రమోషను మీద వస్తున్నారని తెలిసినప్పుడు, ఆ 'సెక్షన్ స్టాఫ్' ఆ వచ్చేఆఫీసరు వయసు పైబడ్డవాడే అయివుంటాడనుకున్నారు. తీరా ప్రకాశం వచ్చి చేరాక తెల్ల ముఖాలు వేశారు. వాళ్ళనుకున్నట్లు ప్రకాశం వయసు పైబడ్డవాడు కాదు, అటూ ఇటూగా పాతికేళ్ళ యువకుడు!

'డ్యూటీ'లో చేరిన రెండు మూడు రోజుల్లోనే ప్రకాశం అందరినీ ఆకర్షించాడు. అతడిది చూడముచ్చటైన విగ్రహం, అందుకు తగ్గట్లు అందరినీ ఆకట్టుకునే వాక్చాతుర్యం. అతడు కుర్రకారుకి కుర్రాడు. పెద్దవాళ్ళకి పెద్దవాడు. వయసు పైబడ్డ వాళ్ళతో మాట్లాడుతున్నప్పుడు వాళ్ళ వయసుకి గౌరవమిస్తాడు. 'కుర్రాడైనా పెద్ద వాళ్ళతో ఎలా మాట్లాడాలో తెలుసు' అనుకుని సంతోషిస్తారు వాళ్ళు. ఇక కుర్రకారులతో సమాన వయస్కులతో మాట్లాడినట్లే మాట్లాడుతాడు 'సోషల్‌గా' 'మూవ్' అవడం ఈయనకు తెలుసు 'అనుకుని ముఖం ఇంత చేసుకుంటారు వాళ్ళు! అంతేకాదు పెళ్ళికాని యువకుల్తో' సాయంత్రం పనేమీ లేకపోతే నాగదికి రాకూడదా, సరదాగా టాంక్‌బండ్‌కో, పబ్లికుగార్డెన్సుకో షికారుగా పోదాం' అంటాడు. వాళ్ళలో ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ఆఫీసరు గారు షికారుకి రమ్మని ఆహ్వానిస్తే 'సబార్డినేట్సు'కి' అంతకన్న ఇంకేం కావాలి? అంతేకాదు, ఆఫీసులో ఎవరినీ 'సబార్డినేట్సు'గా చూడడు; తను ఆఫీసరునన్న గర్వమూ చూపించడు.

ప్రకాశం పదయ్యేసరికల్లా ఆఫీసుకి వస్తాడు, సాయంత్రం అయిదయ్యేసరికల్లా ఆఫీసు మూయించేస్తాడు. అంతకుముందు ఆఫీసరుగారు పదయ్యేసరికల్లా ఆఫీసుకి వచ్చేవాడు, అంతటితో పూరుకోక, పది అయిదు అయ్యేసరికల్లా అంతవరకూ ఆఫీసుకి రానివాళ్ళందరికీ 'అబ్సెంటు' వేసేసేవాడు. మధ్యాహ్నం లంచ్ టైమ్‌లో కూడా హమాయించేవాడు. సాయంత్రం ఆరున్నర దాటితేనేగాని తన సీట్లోంచి

కదిలేవాడుకాదు. ఆఫీసరు ఉండగా ఆఫీసు వదలాలంటే 'సబార్డినేట్సుకి' భయమే కద. అంచేత వాళ్ళు కుక్కినపేలల్లా కూర్చునే వారు, కసిదీరా ఆయన్ని లోలోపలే తిట్టుకుంటూ. ఆ సెక్షనుకి వున్నది ఇద్దరు బంట్రోతులు. వాళ్ళలో ఒకడు ప్రతీనెలా జీతాలిచ్చేరోజున ఆఫీసుముఖం చూసేవాడు. తక్కినరోజులు ఆఫీసరుగారింట్లో బట్టలుతక



డమూ, గిన్నెలు తోమడమూ మొదలైన పనులు చేస్తూ, ఉదయం ఆరింటినుంచి రాత్రి పదింటివరకూ ఆఫీసరు గారింట్లోనే పడుండేవాడు. ఇక ఆఫీసులో వుండే బంట్రోతుకి అయ్యగారికి ఇంటినుండి భోజనమూ, కాఫీ ఫలహారాలు తేవడంతోనే సరిపోయేది. ఇక ఆఫీసులో వాళ్ళకి మంచినీళ్ళు కావాల్సొచ్చినా తెచ్చుకుని తాగాల్సిందే. ఆఫీసరుగార్ని ఆ 'సెక్షనుస్టాఫ్' ఉమ్మడిగా 'వై. డి' అనుకునేవారు. 'వై. డి' అంటే యమధర్మరాజు!

ఆ సెక్షనులో ఇద్దరమ్మాయిలున్నారు. ఇద్దరూ ఇంచుమించు ఒకే వయసువాళ్ళు. దాదాపు ఇరవయ్యేళ్ళు. ఓ పిల్ల పేరు చంద్రసేన. రెండోపిల్లపేరు సులోచన. చంద్రసేన 'స్టెనోటైపిస్టు' సులోచన 'యు. డి. సి.' సులోచన సన్నగా పొడుగ్గా వుంటుంది, ఆమెది పసిడిఛాయ. చంద్రసేన సులోచనంత పొడవరికాదు, ఆమెది పసిడిఛాయకి ఓ మెట్టు తక్కువ. ఆమెను చూడగానే పుష్పించడానికి సిద్ధంగా వున్న సంపెంగ గుబురు కళ్ళ ముందు

మెదుల్తుంది. సులోచన కళ్ళల్లో ఆకర్షణ వుంటే, చంద్రసేన నాసికలో ఆకర్షణ వుంది. సులోచనది సన్నజాజి పువ్వు అందమైతే, చంద్రసేనది బొడ్డుమల్లెపువ్వు అందం!

చంద్రసేనా, సులోచనా చిన్నప్పటి నుండే కలసిమెలసి తిరిగినవాళ్ళే కాదు!బి.ఏ. వరకూ 'క్లాస్‌మేట్సు' వాళ్ళ ఇళ్ళుకూడా ఒకేవీధిలో ఉన్నాయి. ఉదయం ఆఫీసుకి కలసి వస్తారు; సాయంత్రం ఇళ్ళకి కలసి వెడతారు. ఒక్కముక్కలో చెప్పాలంటే వాళ్ళు ప్రాణస్నేహితురాళ్ళు; వాళ్ళమధ్య దాపరికాలూ, రహస్యాలూ ఉండనేఉండవు.

అదే ఆఫీసులో మరోసెక్షనులో సులోచన పిన్నీ పనిచేస్తోంది. అందువల్ల ప్రతిరోజూ 'లంచ్‌టైములో' సులోచన ఆవిడదగ్గరకు వెడుతుంది.

ప్రకాశం 'లంచ్‌టైములో' బంట్రోతులకి పనిచెప్పడు. ఏమైనా కావాల్సివుంటే ముందే తెప్పించుకుంటాడు. కాకపోతే లంచ్‌టైము అయ్యాక తెప్పించుకుంటాడు. కాఫీ మాత్రం ఫ్లాస్కులో ఎప్పుడూ ఉంటుంది. లంచ్‌టైములో ఆ 'సెక్షను'లో మిగిలేదల్లా ఇద్దరు—ఒకరు చంద్రసేన మరొకరు ప్రకాశం. చంద్రసేన ఫలహారం తెచ్చుకుంటుంది అందువల్ల ఆమెకు బయటకు వెళ్ళాల్సిన అవసరం వుండదు. ప్రకాశం తన గదిలో పేపరు చూస్తూ కూర్చుంటాడు.

ప్రకాశం వచ్చిన కొత్తల్లో ఓరోజు 'లంచ్ టైము'లో జరిగిన సంఘటన— చంద్రసేన 'టిఫిన్ బాక్సు' మూత తీసి, టిఫిన్ చెయ్యబోతున్న సమయంలో ప్రకాశం ఏదో ఫైలుకోసం ఆ గదిలోకి వచ్చాడు. అతడు వెళ్ళిపోతాడనుకుంటే ఆ ఫైలు చూస్తూ అక్కడే కుర్చీలో చతికిలబడ్డాడు. చంద్రసేనకి ఏం చెయ్యాలో అర్థమైంది కాదు. అతడు అక్కడే వుండగా, తను వక్కర్తి ఫలహారం చేస్తే ఏం బావుంటుంది? ఆరోజు ఫలహారం 'వెజిటబుల్ బిర్యానీ'. దాన్ని చూస్తూంటే ఆమెకు నోరూరసాగింది. చివరకు అతడికి కూడా 'ఆఫర్' చెయ్యాలని నిశ్చయించుకుంది. 'టిఫిన్ బాక్సు' మూతలో కొంచెం పెట్టి,

"సార్ కొంచెం 'టేస్టు' చెయ్యండి" అంది.

ప్రకాశం ఫైలు చూస్తున్నవాడల్లా చంద్రసేనవైపు చూశాడు, ఆ తర్వాత ఫలహారంవైపు చూశాడు 'వెజిటబుల్ బిర్యానీ' అతడిక్కూడా చాలా ఇష్టం. అయినా మొహమాట పడ్డాడు.

"అబ్బే వద్దండీ...మీరు తెచ్చుకొన్నదే కొంచెం."

"మరేం ఫర్వాలేదు తీసుకోండి."

ప్రకాశం మరి మాట్లాడక 'బిర్యానీ' తిన్నాడు.

"బిర్యానీ చాలా బాగుందండీ. మీ అమ్మగారు చేశారా?"

"అబ్బే కాదండీ. నేనే చేశాను"

"మీకు వంట బాగా వచ్చన్న మాట. బి. ఏ. పాసైన మీకు వంటలో ఇంత ప్రావీణ్యత వుందంటే ఆశ్చర్యంగా వుంది .."

చంద్రసేన చిరునవ్వు నవ్వుతూ అంది

''అంటే మీ ఉద్దేశ్యం చదువుకున్న ఆడవాళ్లకి వంట రాదనా?''

ప్రకాశం సమాధాన మివ్వలేదు. నవ్వేశాడు.

అది మొదలు 'వెజిటబుల్ బిర్యానీ' తెచ్చినప్పుడల్లా ఇద్దరికి సరిపడా తెస్తోంది. ప్రకాశం మొహమాట పడ్డం మానేశాడు ప్రతీసారీ చంద్రసేన వంటని తెగ మెచ్చుకుంటున్నాడు.

ఒక పురుషుడు ఒక స్త్రీకి తన ఇష్టతను చూపే మార్గాలు చాలా వున్నాయి అందులో ఒకటి-ఆ స్త్రీ వంటని మెచ్చుకోవడమేమో? అంతేకాక అతడు తనతో చనువుగా ఉంటున్నాడు దాని అర్థం? ప్రకాశం తన హృదయంలో ఏనాడో తిష్టవేశాడు. ఆలోచించగా అతడు కూడా తనను ప్రేమిస్తున్నా డన్పిస్తోంది. అన్పించడమేమిటి? ప్రేమిస్తున్నాడు. దాన్లో అనుమానంలేదు ప్రకాశం తనను ప్రేమిస్తున్నాడన్న వూహ చంద్రసేనకి రానురాను మరింత బలపడింది.

ఓ శనివారం లంచ్ టైములో ప్రకాశం అన్నాడు.

''వచ్చేవారమంతా నేను సెలవుమీద వుంటాను చంద్రసేనగారూ ''

చంద్రసేనకి ఆరోజు రాత్రి నిద్ర పట్టింది కాదు పాతికేళ్ళ ప్రకాశం పొడుగ్గా బలంగా చూడ ముచ్చటగా వుంటాడు. అతడి నొక్కుల జుత్తును చూస్తూంటే వేళ్లతో దువ్వాలన్పిస్తుంది. తను అతడిని గాఢంగా ప్రేమిస్తున్నది. అయితే ఆమాట అతడితో చెప్పలేకపోతున్నది. అందుకు కారణం తను స్త్రీ. తను సిగ్గుపడటం సహజం అతడు కూడా తనను ప్రేమిస్తున్నాడు. ఆ మాట తనతో చెప్పలేక పోతున్నాడు. ఎంతగా ప్రేమిస్తున్నాడో! కాకపోతే యెవరికీ చెప్పని మనిషి 'వచ్చే వారమంతా నేను సెలవు మీద వుంటాను చంద్రసేనగారూ'' అని ప్రత్యేకంగా తన తోనే యెందుకు చెప్పాలి? అయినా మగాడికి ఆ సిగ్గేమిటి! అంత సిగ్గయితే ఏ బల్లకో, కుర్చీకో చెబుతున్నట్లు ''నిన్ను ప్రేమిస్తున్నాను చంద్రసేనా ...'' అంటే పోలా? పోనీ ఆ ముక్క చెప్పడానిక్కూడా సిగ్గయితే ఓ కాగితం ముక్కమీద 'ఐలవ్ యూ చంద్రసేనా.' అని రాసియిస్తేపోలా? లేకపోతే ఆ మాట చెప్పే ముందు తను ఎలాంటిదో 'స్టడీ' చేస్తున్నాడా? కొంద రాడ వాళ్ళు 'లవ్' అన్న ముక్క చెవిన పడగానే విరుచుకు పడతారట! ఖర్మ . తనను కూడా అలాంటి ఆడవాళ్ళలో జమ వేశాడో యేమిటో?...ఎప్పుడో చదివిన కథ గుర్తుకొచ్చింది. దాన్లో నాయకీ నాయకులు ఒకరి నొకరు ప్రేమించుకుంటారు. ఐతే నాయకి తనను ప్రేమిస్తున్నట్లు నాయకుడుకి తెలీదు, నాయకుడు తనను ప్రేమిస్తున్నట్లు నాయకికి తెలియదు. ఒకరి నొకరు అపార్థం చేసుకుంటారు. నాయకుడు తనను ప్రేమించడం లేదనుకుని, తండ్రి స్థిర పర్చిన సంబంధానికి ఒప్పుకుంటుంది నాయకి. నాయకుడు చాలా కాలంపాటు బ్రహ్మచారిగానే ఉండిపోతాడు. చంద్రసేనకి వళ్ళు గగుర్పొడిచింది. తమ కథ కూడా అలాగే అయితే ఇంకేమన్నావుందా.

"ఈ కథ ఇలా కొనసాగకూడదు,సుఖాంతం కావాలి" అన్న నిర్ణయానికి వచ్చింది. కథ సుఖాంతం కావడానికి ఏం చెయ్యాలో మాత్రం అర్థం కాలేదు.

ఇద్దరాడవాళ్లు ఎంత ప్రాణస్నేహితురాళ్లయినా, ప్రేమ విషయంలో మాత్రం రహస్యంగా వుంచుతారట. చంద్రసేనకీ, సులోచనకీ రహస్యాలు, దాపరికాలు లేకపోయినా, తన ప్రేమ విషయం మాత్రం సులోచనకి చెప్పలేదు చంద్రసేన. తన ప్రేమ విషయంగా సులోచన సలహా అడగాలని ఒకరోజు నిశ్చయించుకుంది చంద్రసేన.

ఆ మరునాడు ఉదయం చంద్రసేన సులోచన ఇంటికి వెళ్ళింది. కొంతసేపు లోకాభిరామాయణం జరిగాక,

"సాయంత్రం 'పబ్లిక్ గార్డెన్సు'కి వస్తావుటే? నీకో విషయం చెప్పాలి" అంది చంద్రసేన.

"అలాగే . నేనూ నీకో విషయం చెప్పాలనుకుంటున్నానే"అంది సులోచన.

ఆ సాయంత్రం చంద్రసేనా, సులోచనా 'పబ్లిక్ గార్డెన్సు'కి వెళ్ళారు. పచ్చికలో కూర్చున్నారు సులోచన ఆతృతను ఆణచుకోలేక.

"చెప్పవే చంద్రా ఏమిటా విషయం" అంది.

తలెత్తి సులోచన వైపుచూసి, సిగ్గుతో ముఖం దించుకుని, అతిమెల్లగా "నేనొకర్ని ప్రేమించానే " అంది.

నమ్మలేని విషయం వింటున్నట్లు చంద్రసేన వైపు చూస్తూ,

"నువ్వు చెప్పింది నిజమేనటే?" అంది సులోచన.

"అక్షరాలా నిజం."

"నువ్వు అతడిని ప్రేమిస్తున్నావు బాగానే వుంది. అతడు నిన్ను ప్రేమిస్తున్నాడో లేదో తెలుసుకొన్నావా? "

"నేను ఫలహారం పెట్టినప్పుడల్లా నా వంటని తెగమెచ్చుకొంటారు ..ఓ మగాడు ఓ ఆడదానికి తన ఇష్టతను చూపే మార్గాల్లో వంటని మెచ్చుకోడం ఒకటంటారు. ఆయన నా వంటని అంతగా మెచ్చుకుంటున్నారంటే, ఆయన ప్రేమిస్తున్నట్లే కదా?" సులోచన కొద్ది క్షణాలు ఆలోచించి,అంది;

"అవుననుకో అలాగే అన్పిస్తోంది మరి ఇంతకీ నువ్వు వరించిన అతగాడెవరు?"

"చెబుతాను కాని నువ్వు చెబుదామనుకున్న విషయం ముందు చెప్పు."

"నేనూ ఒకర్ని ప్రేమించానే."

"నిజంగా?"

"అవునే. .ఆయనకూడా నన్ను ప్రేమిస్తున్నారన్పిస్తోంది. యెప్పుడూ నేను కట్టుకొచ్చిన చీరని పొగుడుతారు. మీకు చీరల 'సెలెక్షను' బాగా తెలుసండీ అంటారు. మీలా సన్నగా, పొడుగ్గా, పసిడి ఛాయతో వున్నవాళ్ళకి ఇలాంటి చీర చాలా బాగుంటుందండి అంటారు....అంటే దాని అర్థం 'మీరు అందంగా వుంటారు. మీరు నాకు నచ్చేరు' అనేగా? "

"అలాగే అన్పిస్తోంది ఇంతకీ నువ్వు వరించిన అతగాడెవరు? . "

"ముందు నువ్వు చెప్పు."

"మన ప్రకాశంగారేనే."

చంద్రసేన సిగ్గుతో ముఖం దించు

కుంది. సులోచనకి వళ్ళుమండింది.

''ఆయన నీవంటని మెచ్చుకున్నంత మాత్రాన నిన్ను ప్రేమిస్తున్నారని ఎలా గనుకున్నావే వెర్రి బాగుల్దానా ఇంట్లో వంట మనిషి వంట బాగా చేస్తే మెచ్చుకోమా? అలాగే ఆయనా నీవంటని మెచ్చుకుంటున్నారేమో? ''

చంద్రసేన చిన్నబుచ్చుకుని, ''నన్ను వంటమనిషితో పోలుస్తావటే? ఇంతకూ నువ్వు ప్రేమించిం దెవరిని? '' అంది

''ప్రకాశంగారినే . ఆయన నేను కట్టుకున్న చీరని పొగుడుతారు. సన్నగా పొడుగ్గా పసిడిఛాయతో వుంటానంటారు. ఆయన నన్ను గాఢంగా ప్రేమిస్తున్నారు. అందులో అనుమానంలేదు ''

''సర్లే'. నీమాటలకేంలే నువ్వుకట్టుకున్న చీరని పొగిడివుండవచ్చు .సన్నగా, పొడుగ్గా, పసిడి ఛాయతో ఉంటావనవచ్చు. దానర్థం నువ్వు అందాలభరిణెవని కాదు. రంగుండగానే సరా? ఒక్కసారి అద్దంలో చూసుకో చప్పిడవడలూ నువ్వూను పొడుగ్గా ఉండగానే సరా? దానికి తగ్గ శరీరం ఉండద్దూ గెడకర్రలా వుంటావు ప్రకాశం గారు నన్నే ప్రేమిస్తున్నారు. అందులో ఏమాత్రం సందేహం లేదు ''

''నువ్వు మాత్రం పెద్ద అందకత్తెవేమిటే? పొట్టిగా పీపాలా వుంటావు'' అంటూ సులోచన లేచి విసవిసా నడుస్తూ వెళ్ళిపోయింది.

చంద్రసేన నిట్టూర్పు విడచి, ఆ వెనుకనే ఇంటికి వెళ్ళింది

* * *

ఆ మరునాడు ఉదయం చంద్రసేన సులోచన ఇంటికి వెళ్లింది. సులోచన ఏమీ జరగనట్లే నవ్వుముఖంతో.

''రావే చంద్రా '' అంటూ ఎదురు వెళ్ళింది.

వాళ్ళిద్దరూ కొంతసేపు కబుర్లు చెప్పుకున్నాక,

''మన స్నేహం ఈనాటిదికాదే సులోచనా. ప్రేమవిషయంలో దెబ్బలాడు కోవడ మెందుకు? ఇంతకీ ప్రకాశంగారు ఎవరిని ప్రేమిస్తున్నదీ మనకు తెలియనే తెలియదు. ప్రకాశంగారు వచ్చాక తగిన సమయం చూసి ఎవరిని ప్రేమిస్తున్నదీ తెలుసుకుందాం. మన ఇద్దరిలో ఆయన ఒకరినే ప్రేమిస్తున్నారని మన కిద్దరికీ తెలుసు. ఒకరికి గెలుపు ఇంకొకరికి ఓటమి. ఓటమి ఎవరి కెదురైనా తేలిగ్గా తీసుకుందాం. ఇద్దరమూ ఎప్పటిలాగే స్నేహితురాళ్ళగా ఉందాం'' అంది చంద్రసేన.

''నేనూ ఇవే మాటలు నీతో చెబుదామనుకుంటున్నానే చంద్రా'' అంది సులోచన. ఇద్దరూ మనసారా నవ్వుకున్నారు.

* * *

సోమవారం రానే వచ్చింది. ప్రకాశం ఉత్సాహంతో ఆఫీసుకి వచ్చాడు. ఆ మధ్యాహ్నం 'లంచ్ టైము'లో చంద్రసేనతో,

''రేపు ఆఫీసుకి సెలవు. మీరు మా యింటికి రేపు సాయంత్రం 'టీ'కిరావాలి.'' అన్నాడు ప్రకాశం.

చంద్రసేన అంగీకారంగా తలవూపింది ప్రకాశం తన ఇంటి 'ఎడ్రసు' ఓ కాగితం మీద రాసి ఆమె చేతికిస్తూ,

''సాయంత్రం అయిదింటికల్లా వచ్చెయ్యండి'' అన్నాడు.

చంద్రసేన ఆ కాగితం వైపు చూస్తూ,

''అలాగేనండి'' అంది.

చంద్రసేన విజయనగర్ కోలనీలో వున్న ప్రకాశం ఇంటి ఎడ్రసు చూస్తూ, సులోచనను తలచుకుని జాలిపడింది. ''పాపం ఉత్త వెర్రి బాగుల్ది. ప్రకాశం గారు తననే ప్రేమిస్తున్నారని అనుకుంది.''

* * *

ఆ మరునాడు సాయంత్రం నాలుగున్నరయ్యేసరికల్లా 'బస్సుస్టాప్' చేరుకుంది చంద్రసేన. అయితే అప్పటికే 'బస్సుస్టాప్'లో నిలబడి బస్సుకోసం ఎదురు చూస్తోంది సులోచన. చంద్రసేన తెల్ల ముఖం వేసింది. 'సులోచన ఎక్కడికి వెడుతున్నట్లు?' అనుమానం తీర్చుకోడానికి ''ఎక్కడికే వెడుతున్నావ్ సులోచనా'' అంది

''నాంపల్లి స్టేషనుకి. నువ్వెంతవరకూ వెడుతున్నావ్?''

చంద్రసేన తేలిగ్గా ఊపిరి తీసుకుని,

''నేనూ అక్కడికేనే'' అంది.

ఇంతలో నూట ముప్ఫయ్యేడు నెంబరు బస్సు వచ్చింది. అది నాంపల్లి స్టేషనుకి పోతుంది. బస్సు కదిలిపోయింది కాని, సులోచనా ఎక్కలేదు, చంద్రసేనా ఎక్కలేదు. ఒకరి ముఖాలొకరు చూసుకుంటూ నిలబడ్డారు ఆ తర్వాత కొద్ది సేపటికి నూట ముప్ఫయ్ తొమ్మిది నెంబరు బస్సు వచ్చింది. అది నాంపల్లి మీదుగా విజయనగర కోలనీ పోతుంది. వాళ్ళిద్దరూ బస్సు ఎక్కారు

సులోచన చెప్పినట్లు నాంపల్లి దగ్గర దిగలేదు, చంద్రసేనా దిగలేదు. ఇద్దరూ విజయనగర కోలనీలో బస్సు దిగారు.

''ఎందుక్కాని మన మధ్య ఈ రహస్యాలు ప్రకాశంగారు నన్ను 'టీ'కి రమ్మని పిలిచారే సులోచనా. ఆయనింటికి వెడుతున్నాను ఇప్పుడు చెప్పు నువ్వెక్కడకు వెడుతున్నావో'' అంది చంద్రసేన.

''ప్రకాశంగారు నన్ను కూడా 'టీ'కి రమ్మని పిలిచారే చంద్రా. ఆయనింటికే నేనూ వెడుతున్నాను ''

ఆ తర్వాత మాటల్లేకుండానే వాళ్ళిద్దరూ ప్రకాశం ఇల్లు చేరుకున్నారు వాళ్ళు వెళ్ళేసరికి ప్రకాశం హాల్లో కూర్చుని వున్నాడు. వాళ్ళను చూస్తూనే, ''సరిగ్గా అయిదింటికల్లా వచ్చేశారే రండి.'' అన్నాడు నవ్వు ముఖంతో.

వాళ్ళిద్దరూ లోపలకు వెళ్ళి సోఫాల్లో కూర్చున్నారు ప్రకాశం కొద్దిసేపు వాళ్ళతో మాట్లాడి లోపలకు వెళ్ళాడు. వాళ్ళిద్దరూ అతడి కోసం చూస్తూ కూర్చున్నారు.

ఓ 'ట్రే'లో నాలుగు ప్లేట్లలో టిఫినూ, నాలుగు గ్లాసుల్లో మంచి నీళ్ళూ పెట్టుకుని తిరిగి వచ్చాడు. 'నాలుగో ప్లేటూ, నాలుగో గ్లాసూ ఎవరికోసమూ?' అని వాళ్ళిద్దరూ ఆలోచిస్తూన్నంతలో, ఓ ఇరవయ్యేళ్ళ అమ్మాయి ఓ 'ట్రే'లో నాలుగు కప్పుల్లో కాఫీ పెట్టుకుని వచ్చింది. వాళ్ళిద్దరూ ఆమె వైపు చూశారు. ఆమె సన్నగా పొడుగ్గా, పసిడి ఛాయతో తీర్చిదిద్దిన అవయవ సౌష్ఠ

వంతో అపర రతీ దేవిలావుంది. ఆమె టిఫిన్ ప్లేట్లు వాళ్ళిద్దరికీ, ప్రకాశానికి ఇచ్చి తనూ ఒకటి తీసుకుని కూర్చుంది.

"నా భార్య వసుంధర" ఆమెను వాళ్లిద్దరికీ పరిచయం చేశాడు ప్రకాశం.

"వసూ వీళ్ళిద్దరూ మా ఆఫీసులో పని చేస్తున్నారు. ఈవిడ చంద్రసేన, ఆవిడ సులోచన" అంటూ వాళ్ళను ఆమెకు పరియం చేశాడు.

వాళ్ళిద్దరూ పాలిపోయిన ముఖాలతో ఒకరి వైపొకరు చూసుకున్నారు.

"చంద్రసేనగారూ 'వెజిటబుల్ బిర్యానీ' బ్రహ్మాండంగా చేస్తారు మీరు వసూకి నేర్పాలి."

చంద్రసేన తలెత్తి ఆకడి వైపు చూడకుండానే తలవూపింది.

"సులోచనగారూ. చీరల 'సెలెక్షన్' మీకు చాలా బాగా తెలుసు. వసూ చీరలు కొనుక్కోవాలను కుంటోంది. బజారుకి మీరుకూడా వెళ్ళి వసూకి చీరలు 'సెలెక్టు' చేసి పెట్టాలి"

సులోచన శూన్యంలోకి చూస్తూ, అతి మెల్లిగా 'అలాగే' అంది.

"మీరిద్దరూ మా యింటికి తరచుగా వస్తూవుండాలి నాకు ఈ వూరు ఆసలే కొత్త. అసలు తోచడంలేదు" అంది వసుంధర.

తెచ్చిపెట్టుకున్న నవ్వు ముఖాలతో "అలాగే" అంటూ వాళ్లిద్దరూ లేచారు. ★




శ్రీ బాలాజీ వైద్యశాల

డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడీ గుడివద్ద ఫోన్ 551, తెనాలి (ఏ.పి.)

బ్రాంచి 9-D, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వస్థులు, కుష్ఠు - బొల్లి, చర్మ వ్యాధులు హెర్నియా (గిలక), పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం, దగ్గులకు ఉచిత వైద్యం. రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండ బాగు చేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను.